# పోలే !

‘రొడ్డి! లెక్క గావల్ల రొడ్డి’

‘యెంత?’

‘యెయ్యి!’

‘యెంతా?’

‘పది నూర్లు రొడ్డి!’

‘సెట్లగ్గాత్తన్నాయారా దుడ్లు?’

‘అట్ల అనొద్దు రొడ్డి అవుసురం!’

‘లేదు పోలే!’

‘మాయప్పకు సచ్చే దగ్గు రొడ్డి’

‘సాయినీ!’

‘మాయమ్మకు కేన్సరు దేవుడూ!’

‘పోనీ!’

‘దానికి పయి బాగుండ్ల రొడ్డి!’

‘యాం మాయిరోగం?’

‘రేతిరి నుంచి ఉలుకు లేదు. పలుకు లేదు.’

‘కాటికి తోలకపో’

‘దుడ్డు రొడ్డి!’

‘లేదు పోలే!’

‘మాపిటేల పట్టుకో, కావల్లంటే’

‘మాపిటేలే కొండబో,నీ దుడ్డు నువ్వు మారాజులెక్క.’

‘రొడ్డి!’

‘పోలే!’

నారాయణరెడ్డి లోపలికి పోయాడు. వెంకటరాయుడు వెనుదిరిగాడు.

నారాయణరెడ్డి టేపు మంచం మీద వెల్లికిల్ల పడుకొన్నాడు. రమణక్క కాళ్ళొత్తుతూ కూర్చుంది. రెడ్డి లేచి మంచం మీద కూర్చోగానే అగ్గిపెట్టె, బీడికట్ట చేతికిచ్చింది. బీడి ముట్టించుకొని పొగలు వదులుతుంటే, పొగలు కక్కే కాఫీ పావులీటరు గళాసులో తెచ్చి ఇచ్చింది. తాగి గళాసు కింద పెట్టబోతే తీసుకొంది. బీడి తుంట తీసి బయటికిసిరింది. లేవగానే టవలు ఇచ్చింది. పొగలెల్లే నీళ్ళు బొక్కెన నిండా పోసి బచ్చలిలో పెట్టింది. బండమీద రెడ్డి కూర్చోగానే నూనె అంటింది. టపా టపా కొట్టింది. 'సాల్లె' అంటే తంగేడు కాయ రసంతో తల పులిమింది. నురుగెక్కి నారాయణరెడ్డి ఉరిమేసరికి నీళ్ళు పోసింది. కళ్ళు తుడిచింది. ముక్కు కడిగింది. మూతి సవరించింది. మీసం మెలి తెప్పింది.

బచ్చలి బండ మీద కాళ్ళు ఆరదోలి, చేతులు బారజాపి ఉండగానే తంగేడు కాయ తొక్కుతో కాళ్ళు రుద్దింది. చేతులు తోమింది. వీపు తిక్కింది. మనిషిని సాగదీసి, వంచి, ఎత్తి, తిప్పి, లేపి, కుదేసి నున్నగా తోమింది. కడిగిన చేప మాదిరిగా ఉన్నాడు. రాగి బిందెలాగా మెరుస్తున్నాడు. 'యాం నీలిగ్గాసుండావ్ లెయ్' అంది, లేచాడు. 'అదీ జెయ్యాల యట్లా? నీల్లు బోసుకో!' పోసుకొన్నాడు. తువాలు ఇచ్చింది. మొలచుట్టూ దోపుకొన్నాడు. తల తుడిచింది. వీపు తుడిచింది. కాళ్ళూ చేతులు ఒత్తింది. 'లే' అంది, 'నడూ' అంది, 'పా' అంది. ఇంట్లోకి నడిపించింది. మంచం వేసింది. కింద కుంపటి పెట్టింది. బొగ్గులు కణకణ వెలుగుతున్నాయి. నిప్పుల మీద సాంబ్రాణి వేసింది. పొగ! ఇల్లంతా పొగ.

బయట నుంచి చూస్తే ఇల్లు తగలబడుతుందని, ఫైరింజన్ వాళ్ళు గంట కొట్టుకొంటూ వచ్చినా రావచ్చు. తెలిసినవాళ్ళకు నారాయణరెడ్డికి పట్టాభిషేకం జరిగిందని తెలుసు. ధర్మవరం పట్టు పంచె చుట్టు కొంటాడనీ తెలుసు. సింహాసనం ఎక్కుతాడనీ తెలుసు. పొగ తగ్గే సరికి మొగుడూ పెళ్ళాలు మంచం మీద లక్ష్మీనారాయణుల్లాగా పడుకొన్నారు. 'యెప్పుడూ యిదే యావ కటికోనికి' అంటూ లేచింది రమణక్క. బండల చాటుకుపోయి కాళ్ళూ చేతులు కడుక్కొచ్చింది. 'లే పా' లేచి బండల బచ్చలికి పోయి వస్తూ బీడి ముట్టించుకొని రైలింజను వచ్చినట్లు గుప్పుగుప్పున పొగ వదులుతూ వచ్చి, శేషతల్పశాయిలాగా మంచం మీద విలాసంగా వాలాడు.

పొగలెల్లుతున్న ఉప్పిండి ప్లేటు పెట్టింది. పైన కాయించిన నేయి వేసింది. పప్పుల పొడి పక్కనే పెట్టింది. 'తినూ' అంది. తింటున్నాడు.

'యాడా సూపు' ఏం మాట్లాడలేదు. 'యాందట్టా జూత్తన్నా!'

'సూడనీకేందుంది, అంతా జారిపాయ'

'సాల్లే సంబళం!'

పైట సరిచేసుకుంటూ రమణక్క లోపలికి పోయింది.

మంచం మీద కూర్చున్న నారాయణరెడ్డి స్టూలు మీది ప్లేటులోని ఊరబిండి తినేశాడు. అందులోనే చేయి కడుక్కొన్నాడు. మిగిలిన నీళ్ళు తాగాడు. అక్కడే పడుకొన్నాడు. తలమెత్త కింది బీడి కట్ట తీసి బీడి ముట్టించుకొన్నాడు. పొగ వదులుతూ ఊదుతూ శూన్యాన్ని చైతన్య పరుస్తున్నాడు.

రమణక్క వంట చేస్తూ ఉంది. పొగలేని పొయి నుంచి మసాలా వాసన. కూరాకు తెచ్చిందని రెడ్డికి అర్థమయిపోయింది. వాసనకు ముక్కు దురదపుట్టింది. ఆకలికి తిక్కరేగింది. అంతకుముందే తిన్న ఉప్పిండి ఏమయిపోయిందో! ఆకలి అవతరించింది. దశావతారాలు ఎత్తుతూ ఉంది. ఆరోగ్యం వయ్యారాలు పోతూ ఉంది. విరామం, విశ్రాంతి, పనిలేనితనం బుద్ధిని గుద్ది గుద్ది కుదేలు చేస్తూ ఉంది. శరీరం చాదస్తం నేర్చుకొంటూ ఉంది. వొళ్ళు తిమ్మిరెక్కుతూ ఉంది. కోర్కె గుర్రమయింది. జీను లేదు. రౌతు లేదు. అది దౌడు తీస్తూ ఉంది.

అది పది ఇంటూ పద్దైదు అడుగుల ఇల్లు. అందులో పది ఇంటూ అయిదడుగుల భాగం వంటగది. మిగిలిన భాగమే పడకగది. కూర్చున్నా, నిలబడ్డా, పడుకొన్నా అన్నిటికీ అదే గది. నిజానికది కొట్టమే. నాప బండలే గోడలు. పైన తీర్లు, ఆపైన పెంకులు. స్థలం ఐదు సెంట్లే. సరీగ్గా దీని లాంటివే మరి రెండు కొట్టాలు. రెడ్డికి ముగ్గురు పెళ్ళాలు. అప్పట్లో ఇంకో చుట్టపురాలు ఉండేది. ఇప్పుడు వదిలించుకొన్నాడు. ఆ అనుభవంతోనే ముగ్గురికి మూడు కొట్టాలు. రెడ్డికి ఇల్లు లేదు. రోజుకొక ఇల్లు. వేరు వేరు కొట్టాలు. వాళ్ళు తన్నుకు చావకుండా ఉండటానికి. ముగ్గురులో ప్రతిరోజూ ఇద్దరు బేలుదారి పనికి పోతారు. ఒకరు ఇంట్లోనే. ఒక్కరోజే! ఏ మనిషీ రెండు రోజులు ఇంట్లో ఉండదు. రెడ్డి మంచి పనివాడు. వడకలు బాగాకొట్టేవాడు. ఇటుకలు బాగా అందించేవాడు. ఇసుక దిట్టంగా మోసేవాడు. కలవ బాగా కలిపేవాడు. నీళ్ళు తేవటంలో దిట్ట. బరువులు ఎత్తటం, మోయటం, లాగటంలో గట్టి. ఇల్లు కట్టటంలో నేర్పరి. తీరూ బండల ఇల్లయినా, పిల్లర్ల ఇల్లయినా, తన పని తీరు తనదే! అసలు కలిపి గోడ కట్టినా, సిమ్మెంటు కలిపి కట్టినా, ఇసుక వాడటం బాగా ఎరిగినవాడు రెడ్డి. తొందరగా ఎదిగిపోయాడు. పిల్లవాడుగా పనిలో చేరిన రెడ్డి చూస్తుండగానే బేలుదారు మేస్త్రీ అయ్యాడు. ఎవర్ని పనిలో పెట్టుకోవాలో, ఎవరిని వద్దనాలో గమనంలోకి తెచ్చుకొన్నాడు. తన దగ్గర పనిచేసే ఆడవాళ్ళలో నదురుగా ఉన్నవాళ్ళను పదేళ్ళలో ముగ్గుర్ని చేరదీశాడు. ఎవరినీ మనువాడలేదు. ముగ్గురూ పెళ్ళాలనే చెబుతాడు. పెళ్ళాలుగానే మన్నిస్తాడు.

పెద్దామెకి తనంత వయసు. పార్వతమ్మ. చలాకీ మనిషి. కడ్డీ శరీరం. ఎంత బరువు పనయినా చేస్తుంది. పోటీపడితే మగవాళ్ళు కూడా తట్టుకోలేరు. ఎగరటం, దూకటం, ఎత్తులకందీయటం ఇప్పటికీ ఆమెకు కష్టం లేదు.

రెండోమె నల్లమ్మ. తెల్లగా ఉంటుంది. వెన్నెల లాగా సుతారంగా కదులుతుంది. అతి అందగత్తె! వెలిగి పోతుంటుంది. దీపం అక్కరలేదు. అక్క కంటే అయిదేళ్ళు చిన్నది. ఇల్లు కట్టడంలో ఏ పనీ ఆమెకు కష్టం కాదు కానీ, ఏ పని ఎలా ఎప్పుడు చేయాలో చెప్పటం దిట్ట. కట్టుబడిలో ఏ తలకాయ నొప్పి అయినా వస్తే 'యేం చెయ్యాల్ల' అని బేలుదార్లు నల్లమ్మను అడుగుతాడు. ఆమె సలహా పాటిస్తే తల నొప్పి తగ్గుతుంది. ఈ ఇటుక ఈడ పెట్టవద్దు దీన్ని తియ్, దాన్ని పెట్టు అంటూ ఆమె ఏం చెప్పినా వాళ్ళు ఎదురాడకుండా వింటారు. ఎక్కువ మాట్లాడదు. ఆమె నోరెత్తితే పని పడుతుంది.

మూడోమె రమణక్క. పెద్దక్క కన్న పదేళ్ళు చిన్నది. నారాయణరెడ్డికి ముద్దుల పెళ్ళాం అంటారు అందరూ. నాకందరూ ఒకటే అంటాడు రెడ్డి. రమణక్క బంక. అతుక్కొనే ఉంటుంది. ఊడబీకినా ఊడిరాదు. రెడ్డిని బాగా చూసుకొంటుంది. రెడ్డే పని చేయడు. అన్నీ ఆమే చేస్తుంది. రమణక్క వంతు వచ్చినప్పుడే రెడ్డి తలస్నానం చేస్తాడు. ముగ్గురూ ముగ్గురే! మంచి వంటలక్కలు మూడు రుచులు! మూడు సొగసులు! మూడు బొమ్మలు ముచ్చటైన బొమ్మలు. ముగ్గురు పెళ్ళాల ముద్దుల మొగుడు రెడ్డి. త్రిమూర్తులకు కూడా ఈ వైభవం లేదని మురిసిపోతూ ఉంటాడు. రోజుకొక ఇంట్లో ఒకామెతో ఉంటాడు. మిగతా ఇద్దరు బేలుదారు పనికి పోతారు. వారంలో వచ్చిన బట్వాడా వాళ్ళ సొంతం. తాను తాకడు. వాళ్ళు ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసుకోవచ్చు. ఎవరిలెక్క వాళ్ళదే. వాళ్ళ సొత్తు. వాళ్ళిష్టం.

శుక్రవారం ఆడవాళ్ళు ముగ్గురూ ఇళ్ళకాడే ఉంటారు. బట్వాడా తెచ్చుకొని బహుకుశాలగా ఉంటారు. ఆ రోజు రెడ్డి ఇళ్ళ పట్టున ఉండడు. అనంతపురం పోతాడు. రెండు సినీమాలు చూస్తాడు. హోటల్లో తింటాడు. బేలుదార్లతో, కూలోళ్ళతో, మేస్త్రీలతో, హమాలీలతో పోసుకోలు కబుర్లు పెట్టుకొంటారు. రాత్రి ఉరికి వస్తాడు. మర్నాడు ఎవరి ఇంట్లో ఉంటాడో ఆ ఇంటిలో నిద్రపోతాడు.

ఆడవాళ్ళు అక్కాసెల్లెళ్ళ మాదిరిగా ఐకమత్యంగా, ఆత్మీయంగా ప్రాణంగా కలిసి మెలిసి ఉంటారు. గొడవలు పెట్టుకోరు, తిట్టుకోరు, కొట్టుకోరు. వాళ్ళ మంచితనం కొంత, రెడ్డి భయం కొంత, మొగుడు దొరికినందుకు కొంత, ఉన్నంతలో అన్నీ అమిరినందుకు కొంత కలివిడిగానే ఉంటారు. ఆమెకు బాగాలేకపోతే ఈమె చూస్తుంది. ఆమె వండుకోకపోతే ఈమె పెడుతుంది. ఒకరి అవసరాలు ఒకరు చూచుకొంటారు. పనికి కలిసి పోతారు. కలిసి వస్తారు. ఒకే బేలుదారు తావున ముగ్గురూ పనిచేస్తారు. ఏ రోజు అయినా ఆ ముగ్గురిలో ఇద్దరే పనిచేసేది ఒకామె ఇంటి పట్టునే ఉండిపోతుంది.

ఎప్పుడైనా నారాయణరెడ్డిని పంచుకోవటంలో, తన ఇంట్లో ఉంచుకోవటంలో పేచీలు వస్తే, కీసులాడితే వాళ్ళ వీపులు తేడా లేకుండా రామకీర్తన, లంకాదహనం, హనుమద్విజయం,

శ్రీరామ పట్టాభిషేకం. వాళ్ళు కిక్కురుమనరు. పైగా సర్దుకొంటారు. కొంత సంతోషిస్తారు. రెడ్డిని సంతోషపెడతారు. ఎనిమిదిమంది భార్యల్ని నిత్యం, పదహారువేలమందిని అనునిత్యం ఏలుకొన్న శ్రీకృష్ణ పరమాత్ముడు లేనిపోని గొడవల్లో. రొంపిలో, కాళ్ళ బేరంలో నాటకాలాడినట్లు దాఖలాలు ఉన్నాయి కానీ రెడ్డిది ఏకపాత్రాభినయం. నో నాటకం.

చీరెలు తెస్తే ముగ్గురికీ సమంగా తెస్తాడు. ఏం తెచ్చినా, ఏం చేసినా, ఒకేరకం. తేడాలుండవు. కూరగాయలు తెచ్చినా అంతే! ఆకుకూరలు తెచ్చినా అంతే! పళ్ళూఫలహారాలు తెచ్చినా అంతే! బియ్యం మూడు మూటలు, సరుకులు మూడు సంచులు, అన్నీ మూడే మూడు. తానొక్కడే త్రిమూర్తులు.

రెడ్డికి అనారోగ్యంగా ఉంటే పని బంద్. ముగ్గురూ దేవతలైపోయి, దేవతోపచారాలు చేస్తారు. రోగం కంటే సుఖం లేదని సరదాగా చెబుతాడు రెడ్డి. రోగం వచ్చినపుడు, పని లేని రోజుల్లో నారాయణరెడ్డి ముగ్గురికీ ఉమ్మడి సొత్తు. వాళ్ళ ఇష్టం. ఏ సేవ అయినా చేసుకోవచ్చు. భర్త సేవే భగవంతుడి సేవ అని నమ్ముతారు వాళ్ళు.

ముగ్గురిలో ఎవరికి బాగా లేకపోయినా, మిగతా ఇద్దరిలో ఎవరో ఒకరు చూచుకొంటారు. ఇద్దరికి బాగా లేకపోతే మూడోమె చూచుకుంటుంది. తానేమీ పట్టించుకోడు. నారాయణరెడ్డి తాను చేసే మేలంతా ఏమిటంటే తాను పస్తుంటాడు. అనంతపురంలో భోజనం మాత్రం హోటల్లో తింటాడు. ఒకసారి ముగ్గురికి జ్వరం వచ్చింది.రెండు రోజులకి కూడా తగ్గలేదు. ముగ్గుర్నీ అనంతపురం తీసుకొచ్చి గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్చి, నర్సులకు, డాక్టర్లకు బరువు బాధ్యతలు అప్పగించి, తాను పట్టణంలోకి ఉరికి హోటళ్ళను, సినిమాహాళ్ళను పవిత్రీకరించి పరిశుద్ధుడవుతూ వచ్చాడు.

పొద్దు ఇంకా దిగిపోకముందే. సూర్యుడు ప్రతాపం చూపే వయస్సు, నడి వయస్సు కూడా దాటినప్పుడే రెడ్డి విశ్రాంతి సంపాదించుకొన్నాడు. ఆ విరామం సద్వినియోగం చేసుకోసాగాడు. ఆ సద్వినియోగ విద్యలో రాటుదేలి పోయాడు. ఆ విశ్రాంతి ఫలితాలు పంచి పెట్టటంలో ఏ ఆడబంరం లేదు. ఏ పక్షపాతం లేదు. ముగ్గురికి సమానం. ఆ విశ్రాంతి అందించే బహుమానం రోజుకో భార్యకు దానం. ఆమె సేవ చేసుకొంటుంది. ఏ భక్తుడు సేవ చేసుకొన్నా ఏమీ అనుకోని దేవుడులా భార్య సేవలకు పరమభద్రంగా లభిస్తాడు రెడ్డి. రాత్రి అనంతపురం నుంచి రాగానే ఏ దేవత గుడికో వెళతాడు. తన భార్యలు అతనికి దేవతలు. వాళ్ళ ఇళ్ళు గుళ్ళు. ఆ రాత్రి వాళ్ళ సేవ. తెల్లవారితే స్టూలూ ప్లేటూ. కాలకృత్యాలు. స్నానపానాలు. భోజనం నిద్ర. నిద్ర మేల్కొంటే లేచిన రెడ్డికి ప్రయాణమే ప్రయాణం. మధ్యలో ఊపిరి పీల్చుకొన్న సహజంగా బీడి పొగ పీలుస్తాడు. ఊపిరి పీల్చినందువల్ల బ్రతికి ఉంటాడేమో కానీ, పొగ పీల్చినందువల్ల ఆనందం పొందుతున్నాడు. పొగ లాగితే సగం మీడి బుస్సున కాలుతూ లోపలికి

పోవలసిందే. పొగ తిరుపతి యాత్రికుడిలాగా పది క్షణాల పాటు దైవ దర్శనం చేసుకొని గుండె గుడి చుట్టూ ప్రదక్షిణం చేసి, వెలుపలికి అరలు అరలుగా, తెరలు తెరలుగా రింగులు రింగులుగా వయ్యారాలు పోతూ వచ్చి భూమికీ ఆకాశానికీ సంబంధం ఉందని చెప్పి, ఋజువు చేస్తూ వెళ్ళి మేఘాలు సృష్టించి ఎన్నడూ రాని వర్షానికి ఆహ్వానం పలుకుతూ బిళ్ళ బంట్రోతులాగా జీ హుజార్ అంటూ నిలబడి ఉంటుంది.

రోజూ సాయంకాలం వతనగా అనంతపురం పోతాడు. పాతూరు నుంచి బీడీ తాగుతూ కొత్తూరు దాకా సుభాస్ రోడ్డు అని నేడు పిలవబడుతున్న బళ్ళారి రోడ్డులో అడ్డపంచ సగం ఎత్తి పెట్టి, ఎడం చేత్తో పొయిలోకి బీడీ ముక్క ఎగదోస్తూ ఆలోచనలు వండుతూ బ్రిడ్జీ ఎక్కి పోలీసు ట్రయినింగు కాలేజీ దాకాపోయి, వంట పూర్తయి, నంబరు వార్చి, తిన్నగా మట్కా రంగనాయకులు దగ్గరకు పోయి నంబరు చెప్పి, డబ్బు ఇచ్చి, రసీదు తీసుకొని టవర్ క్లాక్ దగ్గరకు చేరుకొని వచ్చే పోయే వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఇన్సపెక్టరులాగా చూచి, పాతూరు బయలు దేరతాడు.

రెడ్డి అదృష్టమో, దురదృష్టమో తక్కువ కట్టినరోజు మట్కా గెలుస్తాడు. ఎక్కువ కడితే ఓడిపోతాడు. ఓటమి ఇష్టం లేదు. గెలవటం సంతోషం. ఎక్కువ పందెం కాయడు. సాధారణంగా గెలుస్తాడు. గెలిచిన రోజు మాత్రం తాగుతాడు. గెలవకపోతే లేదు.పూటీగా తాగి రోడ్డు మీద పడి దొర్లి ఎగతాళీ అవమానాలు పొంది బస్సులకిందో, లారీలకిందో పడబోయి, చావు తప్పి, జబ్బు చేసి, మందులు వాడి బతికి మర్యాద నిలబెట్టుకొన్న పుణ్యం నేర్పిన పాఠం వల్ల ఎక్కువ తాగటం మానేశాడు. తక్కువ తాగినా, మానేసినా ఒకటేననే వాదం కనిపెట్టింది రేడ్డే!

మట్కాలో సుమారుగా లెక్క వచ్చిన రోజు బార్‌లో తాగి, హోటల్లో తిని ఇళ్ళకు మూడు బిరియాని పొట్లాలు తీసుకుపోతాడు. మట్కా ఆడి డబ్బూ దస్కం, భూమి పుట్రా, ఇల్లూ వాకిలీ పొగొట్టుకొన్నవాళ్ళను చాలామందిని చూచిన అనుభవంతో, తాగి ఆరోగ్యం చెడగొట్టుకోవటం, లివరు చెడటం, డబ్బు లేక నాటు కొట్టటం, అదీ లేక రసాయనాలు తాగటం అన్నీ అనుభవంలోకి రావటంతో ఎక్కువగా మాట్కా లేదు, మందూ లేదు. అన్ని పరిమితం. ప్రమాద సూచిక ఎగరవేయని జండాలా టవలు ఊపుకొంటూ ఇళ్ళకు చేరతాడు.

రెడ్డికి ఇంకా నలభై ఏళ్ళు కూడా లేవు. ఉప్పుకారం తింటున్న వొళ్ళు. సహజంగా విశ్రాంతి ఎక్కించే తిమ్మిరి సరిపడా ఆరోగ్యం ఉంది. దానికి తోడు జోరుగా హుషారు ఎక్కించేందుకు పరిమితంగా మందు ఉంది. 'ముదనష్టపోడు యేడి పిత్తాడు' అంటూ ఉంటారు భార్యలు. ఏడిపించకూడదురా అంటే వినడు. ఈరోజు ఏడ్చిన ఆమె మళ్ళీ మూడు రోజులు ఏడవటానికి కళ్ళు తుడుచుకొంటూ ఉంటుంది. ఎంతగా ఏడవగలదో అంతగా ఆ రోజు ఏడ్చే

ఏడ్పు ఏడ్చేస్తుంది. తాను బతుకుతున్నది వాళ్ళను ఏడిపించటానికే అన్నట్లుగా జీవిస్తున్నాడు రెడ్డి.

అదృష్టమో, దురదృష్టమో, వాళ్ళకు ఎవరికీ కడుపు పండలేదు. అందుకు వాళ్ళకు దుఃఖం లేదు. అందుకు తాము బాధ్యులం కామని నలుగురూ అనుకొంటున్నారు. గుడ్డిలో మెల్ల! అదీ లాభమే! కడుపులు కానుపులు పురుళ్ళుపాడూ పరదేసూ అంటూ అవస్థలు పడే అవసరం లేకపోయింది. పిల్లల్లేరంటే లేకపోతనేం అని ప్రశ్నించే పరిస్థితిలో ఉన్నారు. ముగ్గురూ లేక ఇద్దరూ పోయి, ఇద్దరూ లేక ఒకరూ వచ్చి, అదీ పోయి ఒకరూ లేక వద్దు వచ్చి, అదే ముద్దు అని చెప్పి ఇంటింటికి తిరిగి కుటుంబ నియంత్రణ ప్రచారం చేసే పని రెడ్డి మూడు ఇళ్ళలో లేకపోవటం వల్ల ప్రభుత్వం నష్టపోలేదు. పైగా లాభపడింది. రెడ్డిది దేశ సేవ.

గుమగుమ లాడుతున్న మసాలా కూరాకు. పొగలెల్లుతున్న నంద్యాల జిలగర సోనా మసూరి బియ్యం వండిన అన్నం తెల్లగా విడిబొండు మల్లెలు రాశిపోసినట్లుగా ప్లేటు నిండా కనిపించేసరికి అన్నం పరబ్రహ్మస్వరూపమన్న సత్యం బోధపడి, ప్లేటును భక్తితో దగ్గరకు తీసుకొని, ఆకల్ని అదమాయిస్తున్న రెడ్డి ఆవురావురు మంటున్న పులిలాగా లేచి కూర్చొని, అక్కడే గిన్నెలో చేయి కడుక్కొని, అందించిన టవలుతో తుడుచుకొని మంచం కుర్చీగా, స్టూలు టేబిల్‌గా చేసుకొని భోజన పూజకు సిద్ధమయ్యాడు.

రమణక్క అన్నం కూరాకు కలిపి, ఉడుకుడుకు అన్నం ముద్దలు చేసి, ముద్దు ముద్దుగా తినిపిస్తుంటే, ఒకసారి బుగ్గ గిల్లి, ఒకసారి జబ్బ చరిచి, ఒకసారి వీపు సవరించి, ఒకసారి నడ్డి మీద పొడిచి, ఒకసారి తలసాపు చేసి అన్నం తింటున్నాడు రెడ్డి. తాను తినటం ఆపి, అన్నం కలిపి, ఆమెకు తినిపించి, వండిన కూరాకు పూర్తయిపోగానే మిగిలిన అన్నం వేసుకొని, తోడు పెరుగు అంతా వేసుకొని ఇద్దరూ కలుపుకొని, ఇద్దరూ, తినిపించి, తిని, భోజన పూజా కార్యక్రమం ముగించి, చేతులు కడుక్కొని, మూతులు తుడుచుకొని, ప్లేటు కడిగి, చెంబులు గళాసులు తీసి, కూరాకు గిన్నె, అన్నం పాత్ర తీసి వంటగదిలో రమణక్క పెట్టి వచ్చేలోగా బీడి తాగటం ముగించిన రెడ్డి, మంచం మీద సగం ఖాళీగా ఉంచి, సగంలో ఆ పక్కకు తిరిగి పడుకొన్నాడు. రెడ్డిని ఇటు తిప్పటం, మంత్రనగరి సరిహద్దులు ముట్టటం ఆమె ఇష్టం. ఓపిక. నిద్ర లేస్తే రెడ్డి అనంతపురం సొత్తు. ఇళ్ళకొస్తే మరొకరి సొత్తు.

రెడ్డి నిద్ర లేచేసరికి పక్కలో ఉన్న రమణక్క గాఢ నిద్రలో ఉంది. ఆమెను లేపకుండా తల నిమిరి అనంతపురం పోవటానికి సిద్ధమయిన రెడ్డిది బండమీదపల్లె. పొద్దున్నే వచ్చి, లెక్క అడిగి తిట్లు తినిపోయిన వెంకటరాముడిది కూడా ఆవూరే! ఆ రెడ్డికి మాదిగే! వాళ్ళ మీద ఆధారపడ్డ కుటుంబమే.

రెవెన్యూ రికార్డుల్లో కందుకూరు, జంగాలపల్లి వేరు వేరు గ్రామాలుగా ఉన్నా కలిసిపోయిన ఊళ్ళే. మధ్యలో చెరువు ఉంది. నీళ్ళుండవు. చుట్టూ ఇళ్ళు మొలిశాయి. జనం పెరిగారు. కందుకూరు భాగంలో రెడ్డి కరణం ఉంటారు. జంగాలపల్లి పేరుతో రైల్వే స్టేషన్ ఉంది. మామూలు కాలంలో నిద్రపోతున్నట్లున్న జంట గ్రామాలు ఎఫ్ సి ఐ రావటంతో మేల్కొన్నట్లు అయిపోయింది.

కేంద్ర ప్రభుత్వం గిడ్డంగులు కట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏభై ఎకరాల ప్రభుత్వం భూమి, కొంత ప్రజల భూమి కొని ఎఫ్ సి ఐకి పట్టా ఇచ్చింది. పెద్ద గిడ్డంగులు పన్నెండు నిర్మాణం జరుగుతున్నప్పుడే రైల్వేవాళ్ళు ఎఫ్ సి ఐ సైడింగ్ షంటింగ్ ట్రాక్ వేశారు. ఆ గిడ్డంగుల్లో ఆహారధాన్యాల నిలవ, సరఫరా జరుగుతూ ఉంటాయి. అనంతపురం ధర్మవరం మధ్య ఉన్న జంగాల పల్లెలోకి గూడ్సు వేగన్ల ఫార్మేషన్ వస్తే సైడ్‌ట్రాక్‌లోకి వేగన్లను షంటింగ్ చేసి ఇంజను విశ్రాంతి తీసుకొంటూ ఉంటుంది. వేగన్లలో వచ్చిన ఆహారధాన్యాలు, ముఖ్యంగా బియ్యం, గోధుమలు, ఎప్పుడయినా పప్పుధాన్యాలు, చెక్కెర గోడౌన్లలోకి చేర్చాలి. అవసరమయినప్పుడు గోడౌన్లలో ఉండే వాటిని లారీల్లోకి ఎత్తాలి. రైల్వే ట్రాక్ పక్కనే రోడ్డు. దాని పక్కనే గోడౌన్లు. బస్తాలు దించటం, ఎత్తటం అక్కడ ప్రధానమయిన పని. ఈ పని ఏ ఒక్కరోజో ఉండేది కాదు. సంవత్సరం పొడుగునా ఉంటుంది. కొన్నిసార్లు నెలకు ముప్ఫైరోజులూ పని ఉంటుంది. నెలలో రెండు నెలల పనీ చేయవలసి కూడా ఉంటుంది. అందుకోసం హమాలీలను పర్మినెంటుగా నియమించారు. చేసిన పనికి కూలీ ఇస్తారు. గంటకింత అని నిర్ణయించి ఉంచారు. ఓటి చేస్తే మరింత ఎక్కువగా ఉంటుంది. రాత్రి పనిచేస్తే రెట్టింపు కూలీ. గూడ్సుబండి వచ్చి వేగన్ల ఫార్మేషన్ ఎక్కువ సేపు, రోజుకు మించి, గోడౌన్లలో ఉండకూడదు. లారీలు వస్తే సరకుతో వెళ్ళిపోవాలి. పూటకు మించి లారీలు ఆగరాదు. వేగంతో కూడిన ఈ బరువు పనివల్ల కూలీ చాలా ఎక్కుగా ఉన్నట్లే కనబడుతుంది. ఏ హమాలీ అయినా పనికి రాలేకపోతే అతని పని, అతని కొడుకో, అల్లుడో, మరొక మనిషో వచ్చి చేయవచ్చు. అన్‌లోడింగ్ లోడింగ్ పని చకచకా జరిగిపోవాలి. బరువు పని వేగంగా చేయటాన్ని బట్టి కూలీ రేటు బాగుంటుంది. ఎక్కువ కాలం ఎవరూ అంత బరువులు అంత వేగంగా మోయలేక రోగులవుతారు, పనులు మానతారు. అందుకే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వాళ్ళు హమాలీల దగ్గర నుంచి నెల జీతం కాకపోయినా, నెలలో వచ్చే కూలీ డబ్బులో నుంచి పియఫ్, ఇన్సూరెన్స్, గ్రూపు ఇన్సూరెన్స్ నెలనెలా వసూలు చేసి వాళ్ళకు భద్రత కల్పించింది.

ఈ పని తీరు వల్ల గూడ్సు వచ్చిందాకా హమాలీలు పని కోసం ఎదురు చూస్తూ కూర్చోవాలి. వేగన్లు, లారీలు రాగానే చకచకా పని చేయాలి. పని పూర్తికాగానే మళ్ళీ పని వచ్చిందాకా నిరీక్షణ. అందువల్ల కార్పొరేషన్ గోడౌన్లలో హమాలీల అవసరం, పని వేగం ప్రత్యేకతను, ప్రత్యేక నైపుణ్యాన్ని, సంతరించుకొంది. హమాలీల ఆరోగ్యం ప్రముఖంగా మారింది.

నలభై వేగన్ల ఫార్మేషన్ వస్తే పన్నెండు గంటల్లో పని పూర్తి కావాలంటే వందమంది కార్మికులు కావాలి. ఏభై లారీలు లోడు చేయాలన్నా అంతమంది హమాలీలు కావాలి. గూడ్సు ఎప్పుడు వస్తుందో, లారీలు ఏ సమయంలో వస్తాయో, చూచుకొని వెంటనే కార్మికులు పని చేయాలి.

ఆరోజు, అంతకుముందు రోజు పని విపరీతంగా పెరిగింది. గూడ్సు వచ్చింది. అన్‌లోడింగ్ పని. సాయంత్రం లారీలు వచ్చాయి. లోడింగ్ పని. పొద్దుట ఎనిమిది నుంచి రాత్రి పదిదాకా, పనిచేసి కూలీలు అలసిపోయారు. ఆరోజు నెలకూలీ ఇచ్చేస్తారు. అయిదుగంటలకే హమాలీలు పని ఆపేశారు.

వెంకటరాముడు నిన్నా, నేడు మూటలు మోసేది, ఎత్తేది, దించేది చేసి చప్పబడిపోయాడు. నిన్న పొద్దుట తిన్న సద్దితోనే రోజంతా పనిచేశాడు. ఇవాళ సద్ది కూడా తినకుండా పనికి వచ్చాడు. కూలీ వస్తుంది ఇస్తాడు అని నెలపొడుగునా వడలు, దోసెలు, కాఫీ, టీ ఇచ్చే సెట్టి బాకీ కూడా ఎక్కువయింది. ఇంక అరువు బేరం లేదని వారం నుంచి అప్పు ఇచ్చేది లేదని తేల్చటంతో ఖాళీ కడుపుతో పనిచేశాడు వెంకటరాముడు. ఉదయం రెడ్డిని అప్పు అడిగితే, రెడ్డి లేదన్నాడు.

వెంకటరాముడి తల్లికి నయంకాని దగ్గు, క్షయ అన్నారు. ఏవో మందులు గవర్నమెంటు ఆసుపత్రి నుంచి తెచ్చి ఇచ్చాడు. ఏమీ నయం కాలేదు. తండ్రికి ఎదురొమ్ము మీద పుండు లేచింది. ఏం మింగినా, రాసినా నయం కాలేదు. డాక్టర్లు పరీక్షించి కేన్సరు పుండని తేల్చి చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చుకోలేదు. బెంగుళూరుకానీ, హైదరాబాదుకానీ తీసుకుపోయి వైద్యం చేయించమన్నారు. దుడ్డు లేదు. అప్పు పుట్టటం లేదు. లెక్క లేందే ఏ పని జరగదు. దుడ్డుంటే దేవుడు. లేకుంటే దెయ్యం. దుడ్డే దేవుడు. దేవుడుంటే అన్ని పనులూ జరుగుతాయి. లేకుంటే మనిషి ఏ పనీ జరగదు. కాటి శవం కూడా కాలదు. అతని భార్యకు తిండి లేదు. తీర్థం లేదు. వైద్యం లేదు. ఏం జబ్బో తెలియదు. పీలగా అయిపోయింది. పడుతూ లేస్తూ నడుస్తుంది. మొన్నటి నుంచి మంచం పట్టింది. నిన్నటి నుంచి స్పృహ లేదు. నెలకొచ్చే కూలీ లెక్క చేతికి రాగానే ఆసుపత్రికి తీసుకుపోవాలి. లెక్క రెడ్డి ఇచ్చి ఉంటే పొద్దుటే పెళ్ళాన్ని డాక్టరుకు చూపించేవాడు.

వెంకటరాముడు పొద్దుటి నుంచి పని చేస్తూనే ఉన్నాడు. ఆ పనే బరువుల పని. అయినా తప్పదు. ఏమీ తినక నీరసం కొంత, పనివల్ల బడలిక కొంత, అతని కళ్ళు తిరగసాగాయి. రోజూ వచ్చే సెట్టి అప్పు ఇవ్వకపోయినా బట్వాడా రోజుల్లో వచ్చే పుల్లమ్మ కుష్కా, గుడ్డుకూర, దోసె, షారువా, వడ తెచ్చి అమ్ముతుంది. అవి తీసుకొని తినవచ్చు. ఆమె అరువు ఇవ్వదు. దుడ్డు తనకాడ లేదు. తోట హమాలీ తింటూ దయతలచి కూలీలు వెంకటరాముణ్ణి తనతోపాటు

తినమని చెప్పి దుడ్డిచ్చాడు. మూడు దోసెలు కడుపులో ఏ మూలకు చాలలేదు. పాతిక కుర్చీలు పట్టే గదిలో మూడు కుర్చీలు ఏం నిండుగా ఉంటాయి. దరిద్రుడికి ఆకలి ఎక్కువ అంటారు. చాలా తినాలని ఉంది. కడుపు నిండా ఆకలి ఉంది. జేబులో లెక్క లేదు. ఇంకా కావాలనలేదు. అంతకంటే మిత్రుడు ఇప్పించడు. మూడు గ్లాసుల నీళ్ళు తాగి, కడుపు నిండిందని నమ్మి వెంకటరాముడు పని చేస్తూనే ఉన్నాడు.

మూడేళ్ళ నుంచి కూలీ చేస్తున్నాడు. మూటలు మోస్తున్నాడు. మోసి మోసి నడుం వంగిపోయినట్లు అయింది. పెళ్ళయి మూడేళ్ళయింది. ఇరవయ్యేళ్ళకే ముసలివాడయిపోయాడు. పరీక్ష తప్పకపోతే చదువుకొనసాగేది. ప్రభుత్వ బాలుర హరిజన హాస్టల్లో సీటు లేక, స్కూలు వదిలి ఇంటికాడే ఉంటే, ఊరికే ఉంచక పెళ్ళి చేశారు. అంతేగాకా భార్యను పోషించే తండ్రి జ్వరంతో మంచం పట్టాడు. పదిహేడేళ్ళకే కుటుంబం పోషించవలసిన బాధ్యత వెంకటరాముడు నెత్తిన పడింది. తల్లితండ్రుల ఆరోగ్యం బాగుంటే తన నెల కూలీలో ఇల్లు బాగానే గడచిపోతుంది. నెలకొచ్చే బట్వాడాలో చాలాభాగం వాళ్ళ వైద్యం ఖర్చులకు చాలకవచ్చింది. కూటికి కష్టమయింది. కూడు లేక భార్య పీనిగలాగా అయిపోయింది. చిన్న వయస్సు బరువు పనివల్ల వెంకటరాముడు కుంగిపోయాడు. కూడు లేక పనిచేయలేకుండా ఉన్నాడు. పని మానితే కూటికి జరగదు. ఓవర్టైం చేస్తే రెట్టింపు కూలీ వస్తుంది. హమాలీలు ఓటి చేయటానికి ఇష్టపడతారు. నిన్న నేడు కూడా ఓటి కూడా చేశాడు వెంకటరాముడు. పని మానితే, వేరే కూలీ పనిలోకి వస్తాడు. తన పని పోతుంది. పని మానలేదు.

నెలంతా పనిచేస్తే చాలా మొత్తం చేతికి వస్తుంది. పర్మనెంటు వాళ్ళకు పని ఉన్నా లేకున్నా రోజుకు నూటా పదహారు రూపాయలు కూలీ. పని ఉంటే మూటకింత అని రేటు. ఓటి అయితే మరింత రేటు. రాత్రి అయితే రెట్టింపు రేటు. పర్మనెంట్ హమాలీలకు నెలకు పద్దెనిమిదివేలు వచ్చిన నెలలు కూడా ఉన్నాయి. సాధారణంగా నెలలో సారా సగటున పన్నెండు వేలు తక్కువ కాదు. మరీ పనిలేని నెలల్లో కూడా ఏడెనిమిది వేలు నెల బట్వాడా ఉంటుంది. పర్మనెంటు కావాలని హమాలీలయిన కూలీలు, కార్మికులు ఆరాటపడుతుంటారు.

వెంకటరాముడికి ఎక్కువ కూలీ వచ్చిన నెలలో మూడువేలు వచ్చాయి. తక్కువ కూలీ నెలలో వేయి రూపాయలు కూడా రాలేదు. ఆ సొమ్ములోనే వాళ్ళ ఇంటి ఖర్చులు, వైద్యం, మందులు, డాక్టర్ల ఖర్చులు, జరిగిపోవటం కష్టంగా ఉంది. ఆ ముగ్గురికి తోడు ఇప్పుడు వెంకటరాముడు కూడా రోగి అయి, ఆసుపత్రి ఖర్చు చేయవలసివచ్చే పరిస్థితి ఏర్పడింది. వెంకటరాముడి భార్య, పదైదేళ్ళకే భార్య హోదాపొంది, గాజూపూస వచ్చి, మెట్టెలతో, మెట్లు తొడుక్కొని, ఆకాశంలోకి మెటికలెక్కినట్లు పొంగిపోయిందేకానీ, మూడేళ్ళలోని, ముసిలి మొకం వచ్చి, సన్నంగా తీగ మాదిరి ఊగిపోతూ నడుస్తూ, ఓపిక లేక మంచమెక్కి, లేవలేక అక్కడే

పడి ఉండి, చుట్టూ చూడలేక స్పృహ లేకుండా అయిపోయిందని కుంగిపోయే ఓపిక లేకుండా కట్టెలాగా పడి ఉంది.

ఓపిక లేకపోయినా, ముగ్గురిని సాకవలసివచ్చి కూలీ పనిలో కొనసాగుతున్నాడు వెంకటరాముడు. వాళ్ళను పోషించటమే కష్టంగా ఉంటే, డాక్టర్లకు చూపించటం, మందులిప్పించటం మరీ యాతన అయిపోయింది. చేతకాకపోతున్నా మూటలు మోస్తూ బ్రతుకీడుస్తుంది. ఏనాటికయినా పర్మినెంటు హమాలీ అవవచ్చునన్న ఆశ చావకపోవటం వల్లే.

నూరుగురు హమాలీలలో ఎవరయినా చనిపోయినా, పనిమానుకొన్నా, వాళ్ళ ఇంటిలో ఉన్న మగవాడు ఎవడయినా ఆ పనిలో పర్మనెంటు ఉద్యోగిగానే చేరవచ్చు. ఏ హమాలీకయినా చేతకాకపోతే, తన బదులుగా ఎవరినయినా తన పని చేయమని పంపవచ్చు. ఆ హమాలీ చనిపోతే, ఆ బదులు పనిమనిషి హమాలీ కావచ్చు. కొందరు పర్మనెంటు హమాలీలు తమ బదులు మనుషుల్ని పనిలోకి పంపుతున్నారు. కొందరు తమ పదవి నలభై యాభై వేలకు అమ్ముకొంటున్నారు. చాలామంది తమ బదులు తమ పనిచేసేవాళ్ళను పెట్టుకొని, తాము వేరే పనులు చేసుకొంటున్నారు. పర్మనెంటు హమాలీకి పన్నెండు వేలు నెల బట్వాడా ఉంటే, తన బదులు పనిచేసిన కూలీకి మూడువేలు దాకా ఇవ్వవచ్చు. బుద్ధి పుడితే కొంచెం ఎక్కువే ఇవ్వవచ్చు. బదులు పనిచేసేవాళ్ళు ఎక్కువమంది దొరుకుతుంటే కొంచెం తక్కువే ఇవ్వవచ్చు. ఎంత తక్కువకయినా పనిచేయటానికి జనం బాగానే దొరుకుతున్నారు. పర్మినెంటు అయిన లాభం వల్ల హమాలీకి తొమ్మిదివేలు, తన కూలీకి మూడువేలు గిట్టుబాటు. నెలంతా కష్టపడ్డ కూలీకి పావలా అయితే హమాలీకి ముప్పావలా న్యాయం కాదని కూలీలు అనుకుంటారు. కానీ ఏం చేస్తారు? అంత మొత్తం వచ్చే పని మరేది లేదు. బేల్దారు పనిలో కూడా రాదు. ఈ మధ్య బేంకులు లోన్లు విరివిగా ఇస్తూ ఉండటంవల్ల ఏమాత్రం అవకాశం ఉన్న ఉద్యోగి అయినా బాడిగ ఇల్లు వదిలి, సొంత ఇల్లు కట్టించుకొంటూ ఉండటంవల్ల కట్టుబడి పనులు ఎక్కువయి బేల్దార్లు పిరిమగానే ఉన్నారు కానీ, అంతకంటే మూటలు మోసే కూలీకీ గిట్టుబాటు బాగా ఉంది. అందుకే కూలీలు హమాలీల మీద పని కోసం ఎగబడుతున్నారు. ఎర్రగ్గవ కూలోళ్ళను పనిలో పెట్టి, సావు తెలివి పోటుగాళ్ళు సుఖపడుతున్నారు.

రెడ్డి చురుకైన మనిషి. పదేళ్ళ వయస్సులో బేలుదారు పనిలో సొంత సంపాదన ప్రారంభించాడు. బరువులు బాగా మోసేవాడు. తెలివైన వాడు కావటంతో పనులు బాగా నేర్చుకొన్నారు. పనిలో నేర్పరితనం కూడా అలవడింది. తీరు బండ ఇల్లయినా, పిల్లర్లల యిలల్లయినా, అసలు కట్టడమయినా, సిమ్మెంటు నిర్మాణమయినా రెడ్డిని వెతుక్కొంటూ రావలసిందే! అతని నైపుణ్యం అందరికీ రాదు. బార్ బెండరుకు సూచనలు ఇవ్వగలడు. ప్లంబరుకు పని చెప్పగలడు. ఎలెక్ట్రిషియన్‌కు మెలకువలు తెలపగలడు. ఇంజనీరు ప్లాను

గీస్తూ రెడ్డిని పక్కనుంచుకొని, పనిచేసే స్థాయి గమనించిన కాంట్రాక్టర్లు పనంతా నువ్వే చూచుకోమని చెప్పి, వేరే పన్లు చూచుకొనేవాళ్ళు. అదీ నమ్మకం. అంత నేర్పు, ఓర్పు, పనితనం, రెడ్డి మంచితనం వల్ల పనికి పిలవకపోయినా కూలోళ్ళు వచ్చి చాలామంది చుట్టూ ఉండేవాళ్ళు. పిలిస్తే పలకటం కాదు, పిలవకపోయినా పలికేవాళ్ళు.

కందుకూరులో ఫుడ్ కార్పోరేషన్ గోడౌన్లు కట్టేపని వచ్చిన కాంట్రాక్టరు బేల్‌దారు మేస్త్రీలను వెతుక్కొంటుంటే మొదట కంటబడ్డవాడు రెడ్డి. రెడ్డి పనితీరు, మాటకారితనం, వినయ విధేయతలు నచ్చిన ఆఫీసర్లు రెడ్డి అడక్కుండానే హమాలీగా పేరు రాసుకొంటే లోపల్లోపలే పొంగిపోయి కూడా బేల్‌దార్ మేస్త్రీ పని చేయలేకపోతే బతకలేనన్నాడు. అయినా అంతగా ఆఫీసర్లు అడుక్కొంటుంటే కాదనలేక సరే అన్నట్లు తల ఊపి పర్మనెంటు హమాలీ అయ్యాడు. హమాలీ అయినా కూడా కట్టుబడి పనులు, రిపేరు పనులు, కార్పోరేషనువాళ్ళు రెడ్డికే అప్పగించేవాళ్ళు.

ముప్పై ఏళ్ళకే పదేళ్ళ అనుభవమున్న హమాలి రెడ్డికి అప్పటికే ముగ్గురు భార్యలున్నారు. వాళ్ళకు వేరు వేరు ఇళ్ళు కట్టించాడు. కోరికల గుర్రాల స్వారీ ఆరంభించినప్పుడు తానింకా హమాలీగా పనిచేయలేనని తేల్చుకొన్నాడు. బండమీద పల్లి రాకపోకలు తగ్గి అప్పటికే పదేళ్ళు దాటింది. పల్లెలో పండని పొలం, రాని వాన అన్నదమ్ములకు రాసిచ్చి కందుకూరులో స్థిరపడ్డాడు రెడ్డి. రెడ్డి అన్నదమ్ములే వానలు లేక, పొలం పనులు లేక, ఊళ్ళో ఉండలేక, అనంతపురం చేరి చేతనయిన పనులు చేసుకోసాగినప్పుడు, వాళ్ళ ఇంట తరతరాలుగా సేద్దెగాడుగా ఉన్న నాగన్న అవసరం లేకపోయి, ఏ పనన్నా చూచుకోమని చెప్పకముందే, తరతరాల రెడ్డి కుటుంబ బంధం వదులుకొని, అంతకాలం సాకిన ఊరు విడిచి, వచ్చి ఆసుపత్రిలో చేరాడు. అంతే మళ్ళీ సొంత గూటికి చేరలేదు. కందుకూరులోనే నయం కాని రోగం కళ్ళారా చూచుకొంటూ బతుకీడుస్తున్నాడు.

రాత్రంతా దగ్గే తల్లి, మూలిగే తండ్రి, స్పృహ లేని భార్యతో వేగిన వెంకటరాముడు, పొద్దున్నే లేచి, కుండలో నీళ్ళు చెంబులోకి వంచుకొని కడుపునిండా తాగి, 'కూలీ తెత్తా' నని యింటికి చెప్పి, వీధిలోకి వచ్చి గోడౌన్ల ముఖంగా నడక సాగించాడు.

కూలీ దుడ్డు చేతికి రాగానే చేయవలసిన పనులు గుర్తుకొస్తున్నాయి. అమ్మను డాక్టరుకు చూపాలి. మంచి మందులు తేవాలి. బలమైన భోజనం ఏర్పాట్లు చేయాలి. తండ్రిని ఆసుపత్రిలో చేర్చాలి. మంచి వైద్యం చేయించాలి. గంజి కాసి భార్యకు తాగిస్తే ఆమెకు స్పృహ వస్తుంది. బలమైన తిండి పెడితే ఆమె కోలుకొంటుంది. తనను నమ్ముకొని వచ్చింది. తిండి పెట్టలేకపోతే, చనిపోతే ఎంత అవమానం. వెంకటరాముడు గింజుకొంటూ నడుస్తున్నాడు. చిన్ననాయన పిన్నమ్మ వాళ్ళ యిద్దరు పిల్లలతో బండమీద పల్లెలోనే ఉన్నారు. వాళ్ళ బతుకే అంతంతమాత్రం.

వాళ్ళు పిల్లల్ని కూడా చదివించుకోలేకుండా ఉన్నారు. వీళ్ళనేం ఆదుకోగలరు?

తాను చదువుకొనే రోజుల్లో ఎన్నో ఆశలు పెంచుకొన్నాడు. కలెక్టరు కావాలనుకొన్నాడు. కాదంటే గవర్నరు అయినా అయి తీరాలని తలపోశాడు. కారుల్లో తిరగాలనుకొన్నాడు. కనీసం బడిపంతులయినా కావాలని, సైకలయినా కొనుక్కోవాలని, పై క్లాసులకు పోతున్న కొద్దీ నిజాయితీగా ఆశించసాగాడు.

అయ్యవార్లు బాగా ప్రోత్సహించేవాళ్ళు. గవర్నమెంటు బాలుర హాస్టల్ వార్డను ఎంతో ఉత్సాహపరిచేవాడు. సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసర్లు, పిల్లల్ని ఉత్తేజపరచాలని ఎన్నెన్నో తీయటి కబుర్లు చాక్‌లెట్టులాగా పంచేవాళ్ళు. బాగా చదవాలని, మంచి ఉద్యోగం చేయాలని, సుఖపడాలని, అంటరానితనం ఊబిలో కూరుకుపోరాదని హెచ్చరించేవాళ్ళు, అందరి మాటలు అన్ని సూచనలు, పెద్దల హెచ్చరికలు ఆకళింపులోకి తెచ్చుకొన్న వెంకటరాముడు భవిష్యత్తు మీద బంగారు కలలు పరిచి, అవి మెరిసిపోతుంటే పొంగిపోయేవాడు. తాను బాగానే చదువుకోసాగాడు. ఇంజనీరు, డాక్టరు, పెద్దాఫీసరు, ఏదైనా కావాలని ఆరాటం కూడా పెంచుకొన్నాడు. ఇంట్లో తిండి ఉండేది కాదు. హాస్టల్లో భోజనం తృప్తిగా తినేవాడు. ఊళ్ళో అమ్మానాన్నలవి అదవ బతుకులుగా ఆకలిచావులుగా ఉంటే, హాస్టల్లో తిని కూర్చోలేకపోయేాడు. సెలవల్లో ఏ పని దొరికినా చేసేవాడు. పొలం పనులు లేవు. బేల్‌దారుగా పని ఎండాకాలం ఎక్కువగా ఉండేది. తల్లితండ్రులకింత తిండితిప్పలు తప్పేట్టు వండి పెట్టేవాడు. మంచి మార్కులు వచ్చాయిరా, పాసయ్యావురా అనే మాటలు వెంకటరాముడికి సంతోషం కలిగించలేదు. దుఃఖం పెంచాయి. కడుపులో ఆకలి కన్నీళ్ళు తెస్తుంటే ఆనందించే అవకాశం ఎక్కడుంది. మంచి మాటలు కబుర్లు చెప్పినవాళ్ళు, అతడు నవ్వనందుకు బాధ పడలేదు. ఏడవనందుకు ఆనందించారు.

మధ్యాహ్నం మూటలు మోస్తూ వెంకటరాముడు పడిపోయాడు. వాళ్ళూవీళ్ళూ వచ్చి లేపారు. నీళ్ళు తాగించారు. కేరియర్ తెచ్చుకొన్న లింగారెడ్డి తినిపించాడు. గిడ్డంగి పక్కనే కూర్చోబెట్టాడు. ఎవరి పనిలో వాళ్ళు మూటలు మోస్తున్నారు.రెండు రోజుల్నుంచి ఏమీ తినని వెంకటరాముడు ఇంత తినేసరికి కొంత ఊరట కలిగింది. రాత్రంతా నిద్రలేని తనకు మాగన్నుగా నిద్ర రాసాగింది. నిద్ర పోతున్నాడు. చుట్టూ జరుగుతున్నా పనుల ధ్వనులూ వింటున్నాడు. అది మెలకువా కాదు, నిద్రా కాదు.

ఆ స్థితిలో భార్య గుర్తుకు వచ్చింది. పెళ్ళినాటి చీరె కట్టుకొని, బొట్టూ కాటుక పెట్టుకొని, నున్నగా దువ్విన తలనిండా పూలు పెట్టుకొని, పసుపు రాసి, కడుక్కున్న కాళ్ళూ చేతులు ఆడించుకొంటూ వచ్చి, 'అన్నం పెడతారా' అని పిలిచినట్లయితే, తాను వాటేసుకొని, నిలబెట్టినట్లయి కళ్ళు తెరిచి చూశాడు. కల కల్ల. కరిగిపోయింది. కల ఎంత హాయిగా ఉంది! ఎంత తృప్తిగా ఉంది! ఎంతో ఓపిక వచ్చినట్లయింది. లేచి పనిలోకి పోయాడు వెంకటరాముడు,

ఆరోగ్యం గొప్పగా లేకపోయినా ఫరవాలేదు. అనారోగ్యం లేకుండా ఉంటే చాలు. సుఖసంతోషాలు లేకపోతే మానే, కష్టనష్టాలు రాకుండా ఉంటే మేలు. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్రా ఉంటే ఎంత అదృష్టం. వెంకటరాముడు అదృష్టం అన్వేషిస్తూ మూటలు మోస్తున్నాడు. ఆకలయిన కడుపు వానలేని చేను. తిన్నదరగని కడుపు వరదవచ్చిన యేరు. ఆ చేను, ఈ యేరు స్నేహమెప్పుడు.

ఎకవుటెంటు బేంకు నుంచి డబ్బు డ్రా చేసి తెచ్చాడు. క్లర్కు ఎవరికెంత వస్తుందో లెక్కచేసి కూడి మొత్తం వేసి ఉంచాడు. ఎవరయినా జీతం ఇచ్చేముందు కూడిన మొత్తం చూచుకోవచ్చు. ఇద్దరూ కలిసి నూరు కవర్లలో నూర్గురికిచ్చే సొమ్ము పెట్టి ఉంచారు. బొటినేలు ముద్ర వాళ్ళు కూడి ఈ మధ్య సంతకం నేర్చుకొన్నారు. పే బుక్కు ఎకవుంటెంటు దగ్గర నాలుగ్గంటల నుంచి సిద్ధంగా ఉంది. ఐదింటికి బట్వాడా ఉంటుంది.

ఏరోజూ యఫ్‌సిఐ లో కనిపించని వాళ్ళు ముప్పై మంది వచ్చారు. నీటుగా ఫేంటు వేసుకొని, శ్లాక్ తొడుక్కుని, తలకు నూనె పట్టించి, షోగ్గా దువ్వుకొని వచ్చారు. నిత్యం పనిచేసే వాళ్ళు డబ్బైమంది అడ్డపంచెలతో, బనీనులతో, సెల్లాడం అంగీలతో, మురికి కారుతున్న చెమటను తుడుచుకొంటూ చేతులు, మూతులు కడుక్కొని తలగుడ్డతో అద్దుకొంటూ వచ్చారు. రోజూ మూటలు మోసినా ఆఫీసు నుంచి నెల బట్వాడా అందుకోలేనివాళ్ళు ముప్పైమంది నడుములు వంగి, కాళ్ళు వణుకుతూ, కళ్ళు పీక్కుపోయి, జట్టురేగిపోయి, విదిలించి భుజం మీద వేసుకొన్న సెల్లాకు చేతులు రుద్ది శుభ్రం చేసి నిలబడ్డారు.

ఆ నెలలో అందరికీ సమానంగా పన్నెండువేల రెండు నూర్ల దుడ్డు వచ్చింది. పనికిరాని హమాలీలు జీతం తీసుకొని పనికి వచ్చిన కూలీలకు కార్మికులకు రెండువేల ఏడువందల ఏభై రూపాయలు చెల్లించారు. తొమ్మిదిన్నరవేలు పనిచేయని హమాలీలకు వచ్చింది.

ఇదేం మోసమో వెంకటరాముడికి అర్థం కావటం లేదు. సంపన్నులు, ధనవంతులు, కర్మాగారాల యజమానులు కార్మికులను, కూలీలను, ఉద్యోగస్థుల్ని దోచుకొంటారని, కేపిటలిస్టులు వర్కర్లను రక్తమాంసాలు పిండి పిప్పిచేస్తారని, తాను స్కూలులో స్ట్రయిక్ చేసినప్పుడు నాయకులు ఇచ్చిన ఉపన్యాసాలు విని తెలుసుకొన్నాడు. గ్రామంలో రైతులు కూలీలకు కూలీ సరిగ్గా ఇవ్వక ఇబ్బంది పెడతారని చూశాడు. రైతుల్ని, వాళ్ళ పంటను, వ్యాపారస్థులు, దళారులు మోసం చేస్తారని గ్రహించాడు. వర్తకుల్ని ప్రభుత్వాధికార్లు పన్నులు, నేరాలు, శిక్షలు పేరిట హింసించటం గుర్తించాడు. ప్రభుత్వాలను పెట్టుబడిదారులు నడుపుతారంటే అర్థం చేసుకోవటానికి ప్రయత్నించగలడు. కానీ కార్మికుడు కార్మికుణ్ణి మోసం చేస్తాడంటే నమ్మలేని జనాన్ని చూచి తాను నవ్వుకోగలడే కానీ ఏమీ చెప్పలేడు. ఎవణ్ణి ఎవడైనా ఎప్పుడైనా దోచుకొంటాడు. దోచుకొనే అవకాశం ఎవడు ఎవడికిచ్చినా, అదనుచూచి సందు దొరికిననాడు ధర్మంగా, న్యాయంగా,

నీతిగా, నిజాయితీగా దోచుకోగలడు. హమాలీలు కూలీల శ్రమ దోచుకొన్నట్లే, చెమట కొన్నట్లే, చెమటకు ఖరీదు కట్టినట్లే! ఏమీ శ్రమ పడనివాడు ముప్పావలా తీసుకుపోతుంటే, నెల పొడుగునా వొళ్ళు హూనం చేసుకొన్నవాడు పావలా తీసుకుపోతున్నాడు. ఇదేం న్యాయం?

న్యాయమే! నీకు పనిలేదు. నీకు కూలీ లేదు. నేను పని ఇచ్చాను. కూలీ ఇచ్చాను. పైసా తగ్గించలేదు. ఇంతకంటే ఏం ధర్మం? ఏం నీతి? ఏది నిజాయితీ? ఇందుకు నువ్వు సంతోషించాలి. సంతోషించకపోగా ఏడవటం ఏం నీతి? ఏం న్యాయం? అవి హమాలీలు అడగగలరు.

ఏమీ పనిచేయని నీకు ముప్పావలా ఏమిటి? ఇంత పనిచేసిన నాకు పావలా ఏమిటి? అని ప్రశ్నిస్తే అది అదృష్టమని, భగంతుడి ఏర్పాటని, దైవ నిర్ణయమని చెబుతారు. నీకున్న అదృష్టం నాకెందుకు లేదంటే అది నీ ఖర్మ, ఇది నా ఖర్మ అని కర్మ సిద్ధాంతం బోధించి, నోరు కట్టేసిపోతారు. అసలు అడిగేవాళ్ళు ఏరి? వచ్చిన దుడ్డు లెక్క చూచుకొని ఇంటితోవ బట్టి, ఉన్నంతలో తిన్నంత తింటున్నారు. ఎవడయినా ప్రశ్నిస్తే వాణ్ణి పనిమానిపిస్తారు. ఇదే కూలికి పని చేయటానికి మనుషులకు కొదవలేదు. భారతదేం పుణ్యదేశం. భారతీయులు పుణ్యాత్ములు. పుణ్యాత్ములు కాబట్టి దేశంలో ఇబ్బడిముబ్బడిగా పుట్టి పెరుగుతున్నారు. ఏ పుణ్యాత్ముడైనా మనిషై, కార్మికుడై, కూలై, ఎగబడి కొదవ అనే జాగాలో కూర్చుని ఖాళీ భర్తీ చేస్తాడు.

వెంకటరాముడు దుడ్డు లెక్క బెట్టుకొన్నాడు. ఈ సొమ్ముతో ఏం చేయాలి? తిండిగింజలు తేవాలా? మందులు తేవాలా? డాక్టర్లకు ఇవ్వాలా? ఏం చేయాలి? ఆసుపత్రుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరుగుతుంటే కూలికి పోలేడు. పోలేకపోతే మరో కూలీ వచ్చి చేరతాడు. తన పని పోతుంది. ఏం చేయాలి? కూలికి పోవాలా? మానాలా? పోకపోతే కన్నవాళ్ళనూ, నమ్ముకొన్న మనిషిని వైద్యులకు చూపించవచ్చు. పోకపోతే వచ్చే ఈ మాత్రం కూలీ లేకా వాళ్ళను కందుకూరు నుంచి అనంతపురం బస్సులోనో, రైల్లోనో తీసుకుపోయే చార్జీలు లేక ఇంట్లో అమ్మా, నాన్నా, భార్యా చనిపోతుంటే చూస్తూ ఉండాలి. వాళ్ళను చంపుకోలేడు. కాబట్టి కూలికి పోతూ ఉండాలి. పోతుంటే తను తొందరలోనే ఆకలికి, అనారోగ్యానికి బలయి చనిపోవటం ఖాయం. ఏదో కూలి వస్తుంది కదా అని పనిచేస్తూ బ్రతికినంత కాలం బ్రతికి చావటమా? ఎట్టాగయినా చచ్చేది ఖాయం. కాబట్టి ఈ కాయకష్టం చేస్తూ చావటం కంటే మాని చావటం మేలు కదా అని కూడా అనిపిస్తూ ఉంది. పని చేయటమా, మానటమా? తేల్లటం లేదు. బ్రతకటమా, చావటమా? నిర్ణయించుకోలేకుండా ఉన్నాడు వెంకటరాముడు.

ఉతికిన తెల్ల ధోవతి కట్టుకొని, ఇస్త్రీ చేసిన సిల్కు జుబ్బా వేసుకొని, పైన సెల్లా వేసుకొని, నీటుగా పాపిట తీసి తల దువ్వుకొని మీసాలు మెలితిప్పుకొని చాకులాగా పదునుతేలి

మెరుస్తున్నా రెడ్డి ఎకవుంటెంటు దగ్గర నెల బట్వాడా తీసుకుని వెంకటరాముడికి నెల కూలీ ఇచ్చి, పాట పాడుకొంటూ అనంతపురం పోయే బస్సు కోసం బయలుదేరాడు.

'రొడ్డి!' వెంకటరాముడు వెంట పడ్డాడు 'యాంరా' అంటూ ఆగాడు రెడ్డి.

'లెక్క కావల్ల దేవరా'

'ఇచ్చినాను కదేమిరా?'

'సాలదు సోఁవి!'

'సాల్ సాల్లే. సరిపోయేకి అద్దా అదుపా లేదు పోలే'

'మాయమ్మ, మాయప్ప, నా పెండ్లాము....

'అందరికీ ఉండారు! లేం దెవురికి! కాల్లుండా కాడికి ముడుసుకోవల్ల. నిగడదోలి నీలగొద్దు!

'మందులు మాకులు కరుసులు దేవరా?'

'అందులోనే అన్నీ సదురుకోవల్ల'

'లెక్కియ్యవా రొడ్డి?' నిలదీసినట్లు మాట్లాడాడు వెంకటరాముడు.

రెడ్డి వాడి ముఖంలో వెర్రిగా చూచి, తొర్రిగా నవ్వి 'ఇచ్చేకి లేదు పోలే' అన్నాడు. అంతటితో ఆగలేదు. 'నాగ్గోదు మా మాదిగోడిని. నువ్వాలి కొడుకువని కూలికి పెట్టుకున్నా.

'లెక్కియ్యకపోతే ఈ కూలీపని నా చేత కాదు దేవరా?'

రెడ్డి నిలబడి ఎగాదిగా చూశాడు. 'మానెయ్! మారాజు లెక్క మానేయ్! గంజి దొరికితే మీసాలు మొలుస్తాయి మాదిగ నా కొడిక్కి!'

'దేవరా నేను నీ కూలోన్ని'

రెడ్డి మాట్లాడలేదు.

రెడ్డి బస్సెక్కుంటే 'దేవరా!' అంటూ కాళ్ళు పట్టుకొన్నాడు, వెంకటరాముడు

'పోలే! మా సగాల కొస్తివో కాల్లు యిరగదీసి పొయిలో బెడతా! పోలే!'

'దేవరా! నీ కూలోన్ని' బస్ హారన్ వేసింది.

'పోలే! కూలోల్లు కొల్లకున్యారు'.

'దేవరా?'

'పోలే!'